నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 21 ఏప్రిల్ 2025 RANGAREDDY

మాల్ గ్రామపంచాయతీకి


## జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు

రూ.కోటి నగదు పారితోషకం, హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




యాచారం, ఏప్రిల్ 20 : ఆత్మ నిర్భర్ భారత్ విభాగంలో ఉత్తమ ప్రత్యేక పంచాయతీ అవార్డు కింద ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డుకు యాచారం మండలంలోని మాల్‌ను కేంద్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి శాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులను అందజేసింది. గత 11న మాల్‌ను కేంద్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రతినిధుల బృందం పంకజ్, చంద్రా నిషా పర్యటించిన విషయం తెలిసిందే.. వారు మాల్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, పలు రికార్డులను, పశువుల సంత స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులపై వారు ఆరా తీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వైకుంఠధామం, రైతు వేదిక, కంపోస్టు యార్డు, పల్లె ప్రకృతి వనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రం ప్రభుత్వం అందజేయనున్న ఆత్మ నిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డు, నేషనల్ పంచాయత్ అవార్డుల కోసం వారు ప్రత్యేకంగా మాల్ పంచాయతీని అధ్యయనం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. మాల్‌లో ప్రతి మంగళవారం పశువుల సంత నిర్వహించడంతో పంచాయతీకి మంచి ఆదాయం వస్తున్నది. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాన్ని తలపించేలా అభివృద్ధి చెందడంతోపాటు మాల్ గ్రామాభివృద్ధిలో బేషుగ్గా ఉండటంతో ఉన్నత స్థాయిలో పరిశీలించిన గ్రామాల్లో నుంచి మాల్ గ్రామపంచాయతీని ఉత్తమ గ్రామంగా ఎంపిక చేశారు. దేశంలోనే 9 ఉత్తమ అవార్డులను అందజేయనుండగా, అందులో తెలంగాణలోనే మాల్ గ్రామపంచాయతీని ప్రత్యేకంగా గుర్తించారు. త్వరలో గ్రామపంచాయతీకి ఆత్మ నిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డును అందించనున్నారు. ప్రత్యేకంగా కోటి రూపాయల నగదు పారితోషకం కూడా అందనున్నది. దీంతో మాల్ గ్రామం మరింతగా అభివృద్ధి చెందనున్నదని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాల్ గ్రామస్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలు, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత మాల్‌కు జాతీయ ఉత్తమ అవార్డు రావడంతో ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో మాల్ గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, సీఈవో కృష్ణారెడ్డి మండల స్థాయి అధికారులను అభినందించారు.

## విద్యుత్ వినియోగదారులకు ఫేక్ మెసేజ్‌లు




విద్యుత్ వినియోగదారులకు వచ్చిన మెసేజ్

పరిగి, ఏప్రిల్ 20 : మీరు గత నెల బిల్లు చెల్లించకపోవడంతో ఈ రోజు రాత్రి 9.30 గంటల తర్వాత విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని, మీరు 7899631520కు ఫోన్ చేయాలని, లేకపోతే వాట్సాప్ నం.8252743020కు చేయాలంటూ పరిగిలోని పలువురు విద్యుత్ వినియోగదారులకు మెసేజ్‌లు రావడంతో వారు వెంటనే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తమ విద్యుత్ సంస్థ ద్వారా ఎవరికీ ఇలాంటి మెసేజ్‌లు పంపించలేదని విద్యుత్ అధికారులు సమాధానమిచ్చారు. ఇలాంటి మెసేజ్‌లకు స్పందించరాదని ట్రాన్స్‌కో పరిగి ఏఈ హరికృష్ణ తెలిపారు. ఇవి ఫేక్ మెసేజ్‌లని, వాటికి స్పందించాల్సిన అవసరంలేదని ఏఈ పేర్కొన్నారు.

# రంగారెడ్డిలో రెండు స్థానాలకు ఉప ఎన్నికలు

- రాజేంద్రనగర్ నుంచి పార్టీ అభ్యర్థిగా పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి
- భవిష్యత్తు అంతా బీఆర్ఎస్‌దే..
- కాంగ్రెస్‌పై నమ్మకం లేకే బీఆర్ఎస్‌లోకి వలసలు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నేత నరోత్తంరెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి

మొయినాబాద్, ఏప్రిల్ 20 : రంగారెడ్డి జిల్లాలో రెండు స్థానాలకు తప్పనిసరిగా ఉప ఎన్నికలు రావడం ఖాయమని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేకనే ఆ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నేత కోట్ల నరోత్తంరెడ్డి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కేటీఆర్ సమక్షంలో తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేశారు. నరోత్తంరెడ్డితోపాటు ఇతర పార్టీల నాయకులకు కేటీఆర్ కండువాలు వేసి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడుతూ.. పార్టీ బీఫామ్‌పై గెలుపొంది బీఆర్ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం చేవెళ్ల, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఆ రెండు సెగ్మెంట్లకు తప్పకుండా ఉప ఎన్నికలు వస్తాయని.. రాజేంద్రనగర్ నుంచి రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలబడి గెలుపొందడం తథ్యమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి ఎమ్మెల్యేలుగా గెలిపిస్తే.. స్వప్రయోజనాల కోసం పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలు, నాయకులకు రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. హామీల అమల్లో పూర్తిగా విఫలం కావడంతో ఆ పార్టీలో ఉన్న నేతలు, నాయకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారని.. అందుకే బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. భవిష్యత్తు అంతా బీఆర్ఎస్‌దేనని.. పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శ్రీహరియాదవ్, సుధాకర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాము, రవియాదవ్, జయవంత్, రవూఫ్, నర్సింహగౌడ్, చెన్నయ్యయాదవ్, సత్తిరెడ్డి, నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, అంజయ్యగౌడ్, భిక్షపతిగౌడ్, శ్రీనివాస్, పరమేశ్, ప్రవీణ్, కరంచంద్, రాంరెడ్డి, రాజు పాల్గొన్నారు.

# సమస్యలతో సహవాసం

- మున్సిపల్ పరిధిలో ఉన్నా.. తండావాసులకు తప్పని తిప్పలు
- ఇండ్ల మధ్యే పెంట కుప్పలు
- అరకొరగా మిషన్ భగీరథ నీటి సరఫరా
- పట్టించుకోవాలని గిరిజనుల వినతి



ఇండ్ల మధ్యనే పిచ్చిమొక్కలు



రోడ్డు పైనే పారుతున్న మురుగునీరు

వికారాబాద్, ఏప్రిల్ 20 : మున్సిపల్ పరిధిలోని రెండు తండాల్లో గిరిజనులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. తాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్యం పడకేసింది. గతేడాది నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ఇటు వైపు రావడమే మానేశారని తండావాసులు వాపోతున్నారు. గెరిగెట్‌పల్లి అనుబంధంగా జాంబపూర్, కొట్టంగుట్ట తండాలున్నాయి. ఈ రెండు తండాల్లో మొత్తం 120 కుటుంబాలు, 500 జనాభా ఉంటుంది. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో కాల్వలో మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్నది. ఇండ్ల మధ్యనే పెంట కుప్పలు, పిచ్చిమొక్కలు ఉండడంతో పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించడంతో తండాల్లో మురుగు కాల్వలు, పెంటకుప్పలు, పిచ్చి మొక్కలు తదితర వాటిని జేసీబీ, పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. మిషన్ భగీరథ నీటితో ఇంటింటికీ నల్లా నీటిని అందజేశారు. తండాలు వార్డుల మాదిరిగా అభివృద్ధి చెందాయి. అంతలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు తండాల్లో ఎక్కడ చూసినా పారిశుధ్యం పడకేసింది. వారానికి ఒకటి, రెండుసార్లు మాత్రమే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చెత్తను తీసుకెళ్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా అరకొరగా రావడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రెండు తండాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. మురుగునీరు, పిచ్చి మొక్కలు పెరగడంతో తండావాసులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయన్నారు. తండాలో నీటి సమస్య పరిష్కరించాలని ఇప్పటికే మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసినట్లు చెప్పారు. ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గిరిజనులు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా రెండు తండాల్లో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టణ ప్రగతి లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి తండాలను శుభ్రం చేసేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు. తండాలవైపు మున్సిపల్ అధికారులు, ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తండాలో పట్టణ ప్రగతి పనులు(ఫైల్)



పైపులైన్ కనెక్షన్ ఇవ్వకపోడంతో నిరుపయోగంగా నీటి ట్యాంకు

### పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి



తండాల్లో ఇండ్ల మధ్యన మురుగు రోడ్లపై పారడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలకు నిలయంగా మారుతున్నది. తండాలకు వారానికి ఒకటి, రెండుసార్లు మాత్రమే చెత్త ట్రాక్టర్ వస్తున్నది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

**- తుక్యానాయక్, తండావాసి, గెరిగెట్‌పల్లి**

### అరకొర నీటి సరఫరాతో ఇబ్బందులు



మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న ఒక్క బోరు నుంచి నీరు ఆగిఆగి వస్తున్నది. దీంతో కూలీ పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతున్నది. తండాల్లో రెండు ట్యాంకులు ఏర్పాటు చేశారు. ఒక ట్యాంకుకు పైపులైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీటిని తెచ్చుకునేందుకు ఇబ్బందులు తప్పడంలేదు.

**- శ్రీనివాస్, తండావాసి, గెరిగెట్‌పల్లి**

# చేతికొచ్చిన పంట నేలపాలు

- అన్నదాతను అతలాకుతలం చేసిన అకాల వర్షాలు
- రంగారెడ్డి జిల్లాలో 500 నుంచి 600 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారుల అంచనా
- భారీగా నేలరాలిన మామిడి కాయలు



రంగారెడ్డి, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాత అతలాకుతలమవుతున్నాడు. ఇప్పటికే సరి పడా నీరందక పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగింది. ఉన్న పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు, వడగండ్లతో పంట పూర్తిగా నేలపాలవుతున్నది. జిల్లాలో ఓ వైపు వరి కోతలు ముమ్మరమవుతున్న తరుణంలో అకాల వర్షాలు రైతన్నను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. దీంతో ఆరుగాలం శ్రమించిన అన్నదాత లబోదిబోమంటున్నాడు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్లు, కడ్తాల్ వంటి ప్రాంతాల్లో అకాల వర్షాలు, వడగండ్లతో వరితో పాటు మామిడి, కూరగాయలు, మొక్కజొన్న, అరటి తోటలు దెబ్బతిన్నాయి. మామిడికాయలు పెద్ద మొత్తంలో నేలరాలాయి. పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



తాటిపర్తి గ్రామంలో ఈదురుగాలులకు పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

### 500 నుంచి 600 ఎకరాల్లో..

వారం రోజులుగా కురిసిన అకాల వర్షాలతో జిల్లాలో 500 నుంచి 600 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. వరితోపాటు వందల ఎకరాల్లో మామిడికాయ తోటలూ దెబ్బతిన్నట్టు భావిస్తున్నారు. ముఖ్యంగా చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో పలుచోట్ల వడగండ్ల వానతో పంట నష్టం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. అనధికారిక లెక్కల ప్రకారం సుమారు వెయ్యి ఎకరాల్లో పలు రకాల పంటలకు నష్టం జరిగిందని రైతులు, రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. నష్టాన్ని అంచనా వేసి అన్నదాతను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పదిహేను రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న సమయంలో వడగండ్లవాన రావడంతో మామిడికాయలు రాలిపోయాయి. కూరగాయల పంటలకూ నష్టం కలిగింది.

### పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం



జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్లతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేస్తు న్నాం. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు పర్యటించి పంట నష్టంపై నివేదికలు తయారు చేస్తున్నారు. ఆ రిపోర్టులు రాగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటాం.

**- జేడీఏ నర్సింహారావు**

## మురుగు తొలగింపు



బొంరాస్‌పేట, ఏప్రిల్ 20 : ఈ నెల 17న నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన 'అస్తవ్యస్తంగా హస్నాబాద్' అనే వార్తకు అధికారులు స్పందించి ఆదివారం మురుగు తొలగింపు చర్యలు చేపట్టారు. చాలాకాలంగా మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపై పారుతూ స్థానిక ప్రజలతో పాటు, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మురుగు తొలగింపుతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## నేడు పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నమస్తే ఎఫెక్ట్

దోమ : సంచుల్లేక కల్లాల్లోనే ధాన్యం అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వరి కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభిస్తున్నట్లు మండల ఏవో ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని శివారెడ్డిపల్లితోపాటు బొంపల్లి, ఖమ్మం, నాచారం, మోత్కూర్, కొండాయపల్లి తదితర గ్రామాల్లో మరిన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు.

## పురాతన భవనాలపై చర్యలేవీ?

### ఈ ఏడాది శిథిల భవనాలపై సమీక్షించని బల్దియా

సిటీబ్యూరో : పురాతన భవనాలపై జీహెచ్ఎంసీ మీనమేషాలు లెక్కిస్తున్నది. ప్రతి ఏటా వర్షాకాలం ముందుగానే ప్రమాదకర భవనాలపై టౌన్ ప్లానింగ్ సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. శిథిల, ప్రమాదకరమైన భవనాల్లో ఉన్న నివాసితులను గుర్తించి.. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయడానికి వారికి ముందుగా కౌన్సిలింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు ఆయా భవనాల చుట్టూ బారికేడ్లను అమర్చాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇప్పటివరకు శిథిల భవనాలపై గుర్తింపు, గతంలో నోటీసులు ఇచ్చిన భవనాలను పటిష్టత, మరమ్మతు పనుల అంశాలపై సమీక్షించిన దాఖలాలులేవు. కనీసం సర్కిళ్లవారీగా కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు లెక్క అధికారుల వద్ద లేదు. దీంతో అసలే అకాల వర్షాలు.. ఆపై వచ్చే వర్షాకాలం దృష్ట్యా ప్రమాదకర భవనాల పట్ల స్థానికులు, నివాసితుల ప్రాణాల భద్రత గాలిలో దీపంలా మారింది.

# ప్రభుత్వ దవాఖానపై పట్టింపేది..?

- సమస్యల వలయంలో ఇబ్రహీంపట్నం ఏరియా ఆస్పత్రి
- అందుబాటులో ఉండని వైద్యులు, వైద్య సిబ్బంది
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటలు వైద్య సేవలు
- ప్రస్తుతం సాయంత్రమైతే చాలు అత్యవసర సేవలు కరువే..
- రోగులకు అందుబాటులో లేని మౌలిక సదుపాయాలు
- ఆస్పత్రి బాగోగులు పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

ఇబ్రహీంపట్నం ఏరియా ఆస్పత్రి రెండేండ్ల క్రితం వరకు డీఎంహెచ్‌వో ఆధీనంలో ఉండేది. 30 పడకల ఆస్పత్రిగా కొనసాగుతున్న తరుణంలో ఈ ఆస్పత్రికి రోజురోజుకూ రోగుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగేది. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోగులకు మెరుగైన సేవలందించాలన్న సంకల్పంతో వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకువచ్చింది. 30 పడకల ఆస్పత్రి స్థాయి పెంచి రోగులకు మెరుగైన సేవలందించడం కోసం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం సహకారంతో ప్రత్యేక భవన నిర్మాణానికి భూమి పూజ కూడా చేయించారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈ ఆస్పత్రి బాగోగులు పట్టించుకునే వారే కరువయ్యారు. ఉన్నతాధికారులు చొరవ చూపకపోవటంతో ఈ ఆస్పత్రిలో వైద్యసేవలు కూడా కుంటుపడ్డాయి. ప్రతిరోజూ రోగులు పెద్దఎత్తున వస్తున్నప్పటికీ అందుబాటులో వైద్యులు, వైద్యసిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో వైద్యసేవలందించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20




ఇబ్రహీంపట్నంలో సీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో నుంచి ముగ్గురు వైద్యులు, 8 మంది నర్సింగ్ సిబ్బంది, వైద్య విధాన పరిషత్ నుంచి ఐదుగురు వైద్యులు, ఇద్దరు నర్సింగ్ సిబ్బంది, 11 మంది నాలుగో తరగతి సిబ్బంది పనిచేస్తున్నారు. అప్పట్లో రోజూ సాయంత్రం వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండేవారు. కాని, నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సాయంత్రం 4 గంటలు తాటితే అత్యవసర కేసులు వస్తే.. ఫోన్ చేసి వైద్యులను పిలిపించుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. అత్యవసర కేసులకు సంబంధించి ప్రథమ చికిత్స చేయించి, నగరంలోని ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. వాంతులు, విరేచనాలే తప్పా అడ్మిట్ కేసులుండవు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు ఎప్పటికీ తీరవు. ఈ ఆస్పత్రికి ఎవరు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నదని, తాము ఎవరి కింద పనిచేస్తున్నామో తమకే తెలియడంలేదని సిబ్బంది వాపోతున్నారు.

### రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

గత నెల 4న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ ఆస్పత్రిని సందర్శించారు. సమస్యలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తామని, ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు, వైద్య సిబ్బందికి సంబంధించిన పూర్తి వివరాల నివేదిక ఇవ్వాలని కోరగా.. నివేదిక పంపినప్పటికీ ఎలాంటి మార్పు లేదని సిబ్బంది, రోగులు వాపోతున్నారు.

### నూతన భవన నిర్మాణం శంకుస్థాపనకే పరిమితం

ఇబ్రహీంపట్నం ఆస్పత్రి ఆవరణలో నూతన భవన నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యాన్ని ఒప్పించి ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయించారు. దీంతో అప్పటి ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు 2022లో శంకుస్థాపన చేశారు. కానీ ఎలాంటి పురోగతి లేక వంద పడకల ఆస్పత్రిగా మారుస్తామన్న హామీ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో ఉట్టి మాటగానే మిగిలిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే భవన నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### సాయంత్రమైతే అందుబాటులో ఉండని వైద్యులు



ఆస్పత్రిలో గతంలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేవారు. కాని, ఇప్పుడు ఈ ఆస్పత్రికి రావాలంటేనే రోగులు భయపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. సాయంత్రం 4 గంటలు దాటిందంటే ఎమర్జెన్సీ కేసులను ఎవరూ పట్టించుకోవడంలేదు. ఈ ఆస్పత్రిలో వైద్యులకు బదులుగా నర్సులు చికిత్స నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు నర్సులు వైద్యసేవలు అందించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్కారు స్పందించి వైద్యులందుబాటులో ఉండేలా కృషిచేయాలి. **- మడుపు శివసాయి, ఇబ్రహీంపట్నం**

### బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సరైన వైద్యసేవలు



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు సర్కారు సరైన వైద్యం అందించింది. కాని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆస్పత్రులకు అవసరమైన మందులు, సరైన వైద్య సిబ్బందిని కూడా నియమించడంలేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నమ్మి సర్కారు దవాఖానాకు పోతే వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**- దేరంగుల సత్యనారాయణ**